క్లుప్తంగా

ముగిసిన కూచిపూడి నృత్య శిక్షణ



నృత్య ప్రదర్శన చేస్తున్న విద్యార్థినులు

ఒంగోలు మెట్రో: నళినీ ప్రియా కూచిపూడి నృత్యానికేతన్, ఒంగోలు వారి ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో 45 రోజుల పాటు స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో నిర్వహించిన శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ ఎస్వీ శివకుమారి సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా పిల్లల్లో వ్యక్తిగత వికాసం, కళల పట్ల ఆకర్షణ కలుగుతాయని తెలిపారు. 45 రోజుల పాటు పిల్లలు నేర్చుకున్న నృత్య పాటలకు సంబంధించిన ప్రదర్శన ఏర్పాటు చేశారు. సంతపేట ఆలయ కమిటీ చైర్మన్ ఆళహరి చెంచలరావు, ఆధ్యాత్మిక ప్రవచకుడు పొన్నూరు శ్రీనివాసరావు, లాయర్ కృష్ణవేణి, ఎక్కిరాల ద్వారకానాథ్ జ్ఞానేశ్వర్, తదితరులు పాల్గొని తిలకించారు. విద్యార్థులు, నిర్వాహకులను అభినందించారు.

భక్తిశ్రద్ధలతో శ్రీవారి ఆస్థానం



చతుర్వేద పారాయణలో అర్చకులు

ఒంగోలు మెట్రో: శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం సాయంత్రం ఒంగోలు కొండమీద శ్రీగిరి వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శ్రీవారి ఆస్థానం కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. శ్రీగిరి దేవస్థానం అర్చకులు, వేద పండితులు శ్రీవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. నాద నీరాజనం, చతుర్వేద పారాయణ, విష్ణు సహస్రనామ పారాయణతో పాటు భారత భాగవత భగవద్గీత రామాయణ శ్లోకాలను గానం చేశారు. గాయకురాలు బొల్లాపల్లి వెంకట ఫణిదీప్తి అన్నమయ్య సంకీర్తనలను మృదుమధురంగా ఆలపించి భక్తులను అలరించారు. శ్రీగిరి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, ఆర్జిత సేవల ధర్మకర్త ఆలూరు సుశీలాదేవి, కార్యనిర్వహణ ధర్మకర్త సీవీ రామకృష్ణారావు, ధర్మకర్తలు ఆలూరు వేంకటేశ్వరరావు, ఆలూరు లక్ష్మీకుమారి తదితరులు పర్యవేక్షించారు. శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు భక్తులకు శ్రీవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

జీజీహెచ్‌లో కర్ర పెత్తనం

- నాలుగో తరగతి ఉద్యోగులపై చిన్నచూపు
- ఫీమేల్ నర్సింగ్, మేల్ నర్సింగ్ స్టాఫ్‌పై పెత్తనం
- అసలు పనికన్నా కొసరు పనికే వినియోగిస్తున్న వైనం



ఒంగోలు టౌన్: స్థానిక ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పనిచేస్తున్న ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓలు కొందరి కర్ర పెత్తనంతో వేధింపులకు గురవుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం జీజీహెచ్‌లో 70 మంది వరకు ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓ, స్ట్రెచర్ బాయ్, ప్యాకర్లు పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రతి ఏడు మంది పేషంట్లకు ఒక ఎంఎన్‌ఓ కానీ ఎఫ్ఎన్‌ఓ కానీ డ్యూటీ చేయాల్సి ఉంటుంది. అందుకు బదులుగా ఫ్లోర్‌కు ఒకరిని చొప్పున మూడు ఫ్లోర్లకు కలుపుకుని ముగ్గురికి డ్యూటీ వేస్తున్నట్లు సమాచారం. క్యాజువాలిటీలో మూడు షిఫ్టులకు కలుపుకుని ఆరుగురు ఎంఎన్‌ఓలు, నలుగురు ఎఫ్ఎన్‌ఓలు ఉండాలని చెబుతున్నారు. క్యాజువాలిటీలో కూడా సరిపడా డ్యూటీలు వేయడం లేదని తెలుస్తోంది. దానికి బదులుగా కొంత మంది ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలకు ఓపీ కౌంటర్లో డ్యూటీలు వేస్తున్నట్లు సమాచారం. జీజీహెచ్‌లో 7 నుంచి 11వ కౌంటర్ వరకు ఓపీలు రాయడం కనిపిస్తుంది. నిజానికి ఓపీ సెక్షన్‌ను ఫార్మసీ డిపార్ట్‌మెంట్ చూసుకోవాల్సి ఉంది. అలాగే ఎంఎన్‌ఓలను ఎలక్ట్రీషియన్లుగా, ప్లంబర్లుగా, డేటా ఎంట్రీ ఆపరేటర్లుగా వాడుకుంటున్నారని సమాచారం. వార్డులలో మంచాల మీద వేసే బెడ్ షీట్లను సీఎస్డీ నుంచి ఎంఎన్‌ఓల చేత తెప్పిస్తున్నారని, తిరిగి వారే సీఎస్డీకి చేర్చాల్సి వస్తోందని ఎంఎన్‌ఓలు వాపోతున్నారు. ఇది తమ పని కాదని, తమను సక్రమంగా వినియోగించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వార్డుల్లో బెడ్‌షీట్లను చేర్చడానికి ప్రత్యేకంగా సిబ్బందిని ఏర్పాటు చేసుకోవాల్సి ఉందంటున్నారు.

కాంట్రాక్టర్ దగ్గర నుంచి నెలవారీ మామూళ్లు...

కాంట్రాక్టర్ వద్ద నుంచి నెలవారీ మామూళ్లు వసూలు చేస్తున్న అధికారులు అనేక పనులను ఎంఎన్‌ఓల చేత చేయిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కొందరు స్టాఫ్ నర్సులు వారు చేయాల్సిన పనులను ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓలచే చేయిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంజక్షన్లు వేయడం, సెలైన్లు పెట్టడం, గాయాలకు కట్టు కట్టడం లాంటి పనులను ఎంఎన్‌ఓలు, ఎఫ్ఎన్‌ఓల చేత, ట్రైనీ నర్సింగ్ స్టాఫ్‌ల చేత చేయిస్తున్నారని ప్రచారం జరుగుతోంది.

ఇక నైట్ డ్యూటీల సమయంలో నర్సింగ్ స్టాఫ్ సక్రమంగా పనులు చేయకుండా ఎంఎన్‌ఓలచేత చేయిస్తున్నారని సమాచారం. స్టాఫ్ నర్సులు మాత్రం సెల్‌ఫోన్లు చూస్తూ కొందరు, గుర్రుగా నిద్రపోతూ ఇంకొందరు గడుపుతున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

నర్సుల సేవలపై రోగుల అసంతృప్తి...

వార్డులలో నర్సుల సేవల పట్ల రోగులు సైతం అసంతృప్తి వ్యక్తం చేస్తుండటం గమనార్హం. అంతేగాకుండా స్టాఫ్ నర్సులు కిందిస్థాయి ఉద్యోగులపై పెత్తనం చేస్తున్నట్లు తెలుస్తోంది. ఎంఎన్‌ఓలు ఎవరైనా చెప్పినమాట వినకపోతే మెమో ఇస్తామంటూ బెదిరింపులకు దిగుతున్నట్లు సమాచారం. జీజీహెచ్ అధికారుల అస్తవ్యస్త విధానాల వలన ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓలు ఇబ్బందులకు గురవుతున్నారు. పేరుకు 70 మంది వరకు ఉన్నప్పటికీ కనీసం ఒక రోజు సెలవు పెట్టుకునేందుకు కూడా అవకాశం లేదని, అత్యవసరమైన పనులు పడినప్పుడు సెలవు పెట్టుకోవాలంటే తనకు బదులుగా మరొకరిని ఏర్పాటు చేసి వెళ్లాల్సిందిగా హుకుం జారీ చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలే అంతంతమాత్రం జీతాలతో బతుకులు వెళ్లదీస్తున్న మేల్ నర్సింగ్, ఫిమేల్ నర్సింగ్ సిబ్బంది అధికారుల ఒత్తిళ్లతో సతమతమవుతున్నట్లు సమాచారం. ఇప్పటికైనా అధికారులు ఎంఎన్‌ఓ, ఎఫ్ఎన్‌ఓల సమస్యలపై దృష్టి సారించాలని, నిబంధనల ప్రకారం వారికి డ్యూటీలు వేయాలని, స్టాఫ్‌నర్సుల పెత్తనాన్ని అరికట్టాలని కోరుతున్నారు. నాలుగో తరగతి ఉద్యోగులను చిన్నచూపు చూడటం మానివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఘనంగా మేరుగు నాగార్జున
జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

సంతనూతలపాడు: వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి మేరుగు నాగార్జున జన్మదిన వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పార్టీ సంతనూతలపాడు మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి ఆధ్వర్యంలో సంతనూతలపాడులో కేక్ కట్ చేసి మేరుగు నాగార్జునకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంతనూతలపాడు జెడ్పీటీసీ సభ్యురాలు దుంపా రమణమ్మ, ఎంపీపీ బుడంగుంట విజయ, సంతనూతలపాడు సర్పంచ్ దర్శి నాగమణి, వైస్ ఎంపీపీ తన్నీరు రాగమ్మ, నాయకులు రావూరి శ్రీనివాసరెడ్డి, కుంచాల నాగాంజనేయులు, బుట్టి విష్ణు, కే పెద్దబ్బాయి, తన్నీరు మోహనరావు, నూకతోటి రాజేష్, బుడంగుంట నాగేశ్వరరావు, అల్లాభక్షు, సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, చిరంజీవి, వల్లెపు శీను, కే లక్ష్మణ, కే వెంకటసుబ్బయ్య, కరుకు సుబ్బారావు, రాంబాబు, ఎన్.రామాంజనేయులు, బొడ్డు శ్రీనివాసరావు, సుబ్బారావు, జి.బెంజిమెన్, తేళ్ల సుబ్బారావు, యోహాన్ తదితరులు పాల్గొన్నారు.

మద్దిపాడులో...

మద్దిపాడు: మేరుగు నాగార్జున పుట్టినరోజు వేడుకలను మద్దిపాడు మండలంలోని వైఎస్సార్ సీపీ సంతనూతలపాడు నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. మద్దిపాడు ఎంపీపీ వాకా అరుణ కోటిరెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. పార్టీ నాయకులు బెజవాడ రాము, నారా సుబ్బారెడ్డి, మండవ బాలచంద్రమౌళి, గుడ్డపాతల రవి, మేకల కృష్ణారెడ్డి, కందుల డేనియల్, మద్ద లక్ష్మీనారాయణ, శ్రీరామమూర్తి, కంకణాల సురేష్, శ్రీకాంత్, రాయపాటి విల్సన్, గద్దె జాలయ్య, సంధ్య, రజిని, బొమ్మల దేవదాసు, బొమ్మల రామాంజనేయులు, డొక్కా మరియమ్మ, నాగమల్లేశ్వరి, తదితర నాయకులు పాల్గొన్నారు.

ఉప్పుగుండూరులో...

నాగులుప్పలపాడు: మేరుగు నాగార్జున పుట్టినరోజు వేడుకలను వైఎస్సార్ సీపీ నాగులుప్పలపాడు మండల నాయకుల ఆధ్వర్యంలో ఉప్పుగుండూరులో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఉప్పుగుండూరులోని అరుణోదయ వృద్ధాశ్రమంలో కేక్ కట్ చేసి వృద్ధులకు భోజనం ఏర్పాటు చేశారు. ఎంపీపీ నలమలపు అంజమ్మ కృష్ణారెడ్డి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ విభాగం కన్వీనర్ కొమ్మూరి కనకారావు, నాయకులు నలమలపు కృష్ణారెడ్డి, మేధావుల విభాగం రాష్ట్ర కార్యదర్శి కంచర్ల సుధకార్, వాణిజ్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు కొంజేటి సురేష్ బాబు, పేరాల చెన్నకేశవులు, మండల ఉపాధ్యక్షుడు కాటూరి ఆదియ్య, మండల యూత్, రైతు విభాగం అధ్యక్షులు ఇమ్మిశెట్టి బాలకృష్ణ, తగిరిశ సుబ్బారావు, కందుల డానియేలు, జెట్టి చెన్నకేశవులు, పాలేరు నాగేశ్వరరావు, అత్తంటి యేసు, గండు హరిబాబు, ఘట్టమనేని అశోక్, పొద పవన్‌కుమార్, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా చెన్నకేశవస్వామి కళ్యాణం



స్వామి, అమ్మవార్ల తలంబ్రాల ఘట్టంలో అర్చకులు



స్వామివారి కళ్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు

ఒంగోలు మెట్రో: శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవ స్వామి కళ్యాణాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. భక్తుల జయజయధ్వానాలు, మేళతాళాల మధ్య వైభవంగా స్వామివారి కళ్యాణాన్ని అర్చకులు జరిపించారు. ఒంగోలు నగరంలోని త్రోవగుంటలో ఉన్న చెన్నకేశవ కోదండరామ స్వామి దేవస్థానంలో జ్యేష్ఠమాసం శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం నిర్వహించిన ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ అర్చకుడు కళ్యాణ్ చక్రవర్తి ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వేదికపై ఏర్పాటు చేసిన మండపంలో చూడచక్కగా అలంకరించిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామిని ప్రతిష్ఠించారు. స్వామివారు, అమ్మవార్ల కళ్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కళ్యాణ క్రతువును తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

భక్తిరస సంకీర్తనల సీడీల ఆవిష్కరణ



సీడీ ఆవిష్కరిస్తున్న పొన్నూరు శ్రీనివాసులు, తదితరులు

ఒంగోలు మెట్రో: రచయిత, గాయకుడు గజ్జలకొండ బాలు రచించి గానం చేసిన భక్తిరస సంకీర్తనల ఆడియో సీడీలను స్థానిక కర్నూలు రోడ్డులోని శ్రీ గోవిందమాంబ సమేత శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానంలో ఆదివారం ఆవిష్కరించారు. దేవస్థానం శాశ్వత ధర్మకర్తలు పేలప్రోలు రామకృష్ణ పరమహంస, పేలప్రోలు బ్రహ్మానందం, ప్రకాశం జిల్లా రచయితల సంఘ అధ్యక్షుడు, ప్రముఖ కవి పొన్నూరు శ్రీనివాసులు, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మారెళ్ల వివేకానంద, కొమ్మి కిష్టయ్య, సినీ నిర్మాత పెనుబోతు భాస్కరరావు, గాయకులు చల్లా నాగేశ్వరమ్మ, మానవతా సేవా సంస్థ అధ్యక్షుడు మారెళ్ల సుబ్బారావు దేవస్థానం అర్చకుడు ఇంకొల్లు మధుసూదనాచార్యులు, మార్నేని సుబ్బారావు, బీవీ రాఘవులు, బొగ్గు సింగయ్య తదితరులు పాల్గొన్నారు. రచయిత, గాయకుడు గజ్జలకొండ బాలును వారంతా అభినందించారు. ఈ సీడీలో 12 భక్తి గీతాలు ఉన్నాయని, అందరూ పాడుకునే విధంగా రూపొందించానని గాయకుడు బాలు తెలిపారు.

కొలుపుల్లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ నాయకులు



పూజలు చేస్తున్న దుంపా చెంచిరెడ్డి, రమణమ్మ, నాయకులు

సంతనూతలపాడు:

మండలంలోని మాచవరం గ్రామంలో జరుగుతున్న గంగమ్మ తల్లి కొలుపుల ముగింపు వేడుకల్లో ఆదివారం వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొని పూజలు చేశారు. పార్టీ మండల అధ్యక్షురాలు మొలకలపల్లి సీతమ్మ ఆహ్వానం మేరకు మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు దుంపా రమణమ్మ ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్టీ మండల కన్వీనర్ దుంపా చెంచిరెడ్డి, ఎంపీపీ విజయానాగేశ్వరరావు, మద్దులూరు సర్పంచ్ శైలజఅమరనాథ్, మాచవరం నాయకులు మొలకలపల్లి రాఘవయ్య, పత్తిపాటి స్వాములు, వీరబోయిన నారాయణ, నల్లూరి బాలకృష్ణ, చుండూరి వెంకటేశ్వర్లు, నిమ్మకాయల తిరుపతిస్వామి, దాసరి కోటేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు. మూడు రోజులపాటు మొలకలపల్లి, పాటిబండ్ల, చుండూరి కుటుంబీకులు గంగమ్మ తల్లి కొలుపులను ఘనంగా నిర్వహించారు. ముగింపు సందర్భంగా అన్నదానం చేశారు.

విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై రాయితీ

పొదిలి: విద్యుత్ వినియోగదారులకు అదనపు లోడు క్రమబద్ధీకరణలో భాగంగా ప్రస్తుత బిల్లులో 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ కామసాని మోహనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో సర్వీస్ తీసుకున్నప్పుడు ఉన్న విద్యుత్ వినియోగానికి, ప్రస్తుత వినియోగానికి లోడ్ వ్యత్యాసం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. సదరు వ్యత్యాసాన్ని క్రమబద్ధీకరించేందుకు ప్రభుత్వం 50 శాతం రాయితీతో అనుమతి ఇచ్చిందని తెలిపారు. 1 కిలో వాట్ లోడ్‌కు రూ.2250 అవుతుండగా రూ.1250, 2 కిలోవాట్ల లోడ్‌కు రూ.4450 అవుతుండగా రూ.2450, 3 కిలోవాట్ల లోడ్‌కు రూ.6,650 అవుతుండగా రూ.3,650 చెల్లించి లోడ్ క్రమబద్ధీకరణ చేసుకోవచ్చని వివరించారు. ఈ నెల 30వ తేదీ లోగా బిల్లులు చెల్లించి, లోడ్ క్రమబద్ధీకరణ చేసుకోవాలని ఏఈ సూచించారు.

హనుమంత వాహనంపై ప్రసన్న వెంకటేశ్వరుడు



హనుమంత వాహనంపై స్వామివారు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణంలోని కంభం రోడ్డులో కొలువైన ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం సప్తమ వార్షికోత్సవంలో భాగంగా ఆదివారం ఉదయం 7 గంటలకు హనుమంత వాహనంపై స్వామివారు శ్రీరాముని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోవింద నామ స్మరణ మధ్య స్వామివారు దేవస్థానం వద్ద నుంచి మెయిన్ బజారు మీదుగా నాలుగు మండపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం 10 గంటలకు భూలీలా సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. వేలాది మంది భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి స్వామివారిని దర్శించుకున్నారు. సాయంత్రం 7 గంటలకు స్వామివారి రథోత్సవం కనుల పండువగా సాగింది. భక్తులకు అవసరమైన ఏర్పాట్లను ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో కోటసత్యమాంబదేవి



ప్రత్యేక అలంకారంలో పొలేరమ్మ తల్లి



రేగడపల్లిలో పూజలందుకుంటున్న పోలేరమ్మతల్లి



భక్తులకు దర్శనమిస్తున్న అంకాలమ్మ తల్లి

బేస్తవారిపేట: మండలంలోని గొట్టమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరుడిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు.

అంకాలమ్మకు ప్రత్యేక పూజలు

తర్లుపాడు: మండల కేంద్రమైన తర్లుపాడు ప్రాంత గ్రామదేవత అంకాలమ్మకు ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారి మూలవిగ్రహ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.తర్లుపాడు తోపాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు. పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ పరిసరాలు భక్తులతో కిటకిటలాడాయి.

పోలేరమ్మకు పూజలు

అర్ధవీడు: మండలంలోని అంకభూపాలెంలో పోలేరమ్మ తల్లికి వివిధ గ్రామాల భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. పాడిపంటలతో గ్రామాలు సుభిక్షంగా ఉండాలని పూజలు చేశారు.

పోలేరమ్మ, అంకాలమ్మకు విశేష పూజలు

కొనకనమిట్ల: మండలంలోని వద్దిమడుగు, రేగడపల్లి, చినమనగుండం గ్రామాల్లో ఆదివారం సాయంత్రం పోలేరమ్మ తల్లి, అంకాలమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలతో గ్రామాలు పచ్చగా ఉండాలని గ్రామస్తులు పూజలు చేశారు.

అల్లూరి పోలేరమ్మతల్లికి పూజలు

మార్కాపురం టౌన్: మార్కాపురం పట్టణ శివారులో వెలసిన అల్లూరి పోలేరమ్మతల్లికి ఆదివారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ ప్రజలతోపాటు పరిసర గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు ఆలయ పరిసరాల్లో పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా సమర్పించారు. నాగశిలలు, పుట్టకు పూజలు నిర్వహించారు.

దేశాభివృద్ధికి మోదీ కృషి

సంతనూతలపాడు: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తన 11 సంవత్సరాల పరిపాలనలో దేశాభివృద్ధికి ఎంతో కృషి చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం సంతనూతలపాడులోని మద్దులూరు రోడ్డులో గల లక్ష్మీవెంకటేశ్వర ఫంక్షన్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. అన్ని వర్గాల సంక్షేమం, అభివృద్ధి సాధనకు ప్రధాని కృషి అభినందనీయమని కొనియాడారు. ఉగ్రవాదాన్ని సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారన్నారు. రక్షణ, ఆర్థిక రంగంలో ప్రపంచ స్థాయిలో భారతదేశాన్ని ముందంజలో నిలిపేందుకు మోదీ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ముందుగా బీజేపీ సంతనూతలపాడు మండల అధ్యక్షుడు బాలినేని కళ్యాణ్‌రెడ్డి ఆధ్వర్యంలో సంతనూతలపాడు మండలంలో సెగ్గం పర్యటించి బీజేపీ నేతలను కలిసి మాట్లాడారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర నాయకుడు గూండా శ్రీనివాసరావు, పొగాకు బోర్డు మాజీ డైరెక్టర్ పోద వరప్రసాదరావు, నాగులుప్పలపాడు మండల అధ్యక్షురాలు పొద అపర్ణ, సంతనూతలపాడు మండల ప్రధాన కార్యదర్శి దేసు రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం.అమరసింహం, నాయకుడు బాలినేని చెంచిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వికసిత్ భారత్.. మోదీ లక్ష్యం

నాగులుప్పలపాడు: 2047 నాటికి వికసిత్ భారత్ లక్ష్యంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పనిచేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సెగ్గం శ్రీనివాసరావు అన్నారు. మోదీ ప్రభుత్వం ఏర్పడి 11 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా ఆదివారం బీజేపీ మండలాధ్యక్షురాలు పొద అపర్ణ ఆధ్వర్యంలో నాగులుప్పలపాడులో కూటమి నాయకులు ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు అమరసింహం, టుబాకో బోర్డు మాజీ డైరెక్టర్ పొద వరప్రసాద్, భూపతి మురళి, తోట అంజి తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు

డివైడర్‌ను ఢీకొట్టిన లారీ

మార్కాపురం: మార్కాపురం నుంచి త్రిపురాంతకంవైపు వెళ్తున్న లారీ ప్రమాదవశాత్తు మార్కాపురం మార్కెట్ యార్డు వద్ద అదుపుతప్పి డివైడరును ఢీకొట్టింది. ఆదివారం చోటుచేసుకున్న ఈ ప్రమాదంలో ప్రాణనష్టం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.



డివైడర్ మీదకు దూసుకెళ్లిన లారీ